కథ



# సెకండ్ ఇన్నింగ్స్

పాలకూర సీతాలత

కృష్ణప్రసాద్ చెయ్యి తిరిగిన రచయిత ఒకప్పుడు. చెయ్యి తిరిగిన రచయిత అంటే ఏ పక్షవాతమో వచ్చి అతని చెయ్యి తిరిగి పోలేదు. మంచి సామాజిక స్పృహ వున్న రచయిత అని అర్థం. ఒకప్పుడు అని ఎందుకన్నానంటే కొన్ని కారణాల వల్ల చాలా కాలం క్రితమే రచనలు చేసే ప్రక్రియకు 'చుక్క' పెట్టేశాడు. ఆ కారణాలు ఏమిటంటే...



వృత్తి రీత్యా అతను ఇంజనీర్. కాలేజీరోజుల్లో కూడా చిన్నా చితకా కథలు రాసి పంపేవాడు. కానీ ప్రచురణకు ఏవీ నోచుకోలేదు. కాలేజీ మేగజైన్స్‌లో మాత్రం ప్రచురించేవారు. ఉద్యోగంలో చేరాక కూడా ఆ ప్రవృత్తి కొనసాగించాడు. కొడితే ఏనుగు కుంభస్థలం కొట్టాలి అన్నట్లుగా ఒకసారి కథల పోటీకి ఒక కథ పంపేడు. అది సాధారణ ప్రచురణకు ఎంపికయ్యింది. అదే ఒక మలుపు. ఆ తర్వాత ఉత్సాహంగా కథలు రాయడం. అవి దాదాపు అన్ని వార, మాస పత్రికలలో ప్రచురింపబడడం జరిగింది. నాలుగైదు సార్లు బహుమతి కూడా వచ్చింది. ఉత్తరాల శీర్షికలో తన కథ మీద ఏవైనా విమర్శలు వచ్చేయేమో చూసి, వాటిని సంకోచించకుండా అంగీకరించి, తర్వాతి కథల్లో జాగ్రత్త పడేవాడు. చుట్టూ వున్న ప్రపంచాన్ని జాగ్రత్తగా గమనించేవాడు. కథాంశాలు సహజమైనవే ఎన్నుకునేవాడు. అతని కథల్లో పొలం దున్నుకునే యువ రైతు అవసరం పడిందని ఆఖర్లో హెలికాప్టర్ నడపడు. పత్రికా సంపాదకులు ప్రత్యేక సంచికల కోసం అతన్ని ఒక మంచి కథ పంపించమని స్థాయికి ఎదిగాడు. ఒక ఇంజనీర్ అయి వుండి, సమయమంతా యంత్రాల మధ్య గడుపుతూ,స్పందించే హృదయం వుండి, ఆ ఆలోచనలను కాగితం మీద పెట్టే అతని సామర్ధ్యాన్ని అందరూ మెచ్చుకునేవారు.

భర్త తడిసిపోకూడదని భార్య గొడుగును అతని వైపుకు వంచుతుంది. భార్య తడిసిపోకూడదని భర్త ఆ గొడుగును ఆమె వైపుకి వంచుతాడు. ఫలితంగా ఇద్దరూ తడిసిపోతారు.



కాలగమనంతో అతని హోదా పెరగడం, దాంతో పాటు బరువు బాధ్యతలు ఎక్కువ కావడంతో అతనికి తీరిక దొర ది కాదు. ఆ కారణం వల్ల రచన ప్రక్రియ వేగం తగ్గి ఒక దుర్ముహూర్తాన పూర్తిగా ఆగిపోయింది.

కంపెనీకి ప్రొడక్షన్ మేనేజర్ కావడం వలన ఇంటికి వచ్చినా తీరిక లేదు. రాత్రి పూట కూడా ఫోన్లు, అవసరం అయితే మళ్లీ ఫ్యాక్టరీకి వెళ్లడాలు, ఏ పని చెయ్యడానికైనా తీరిక దొరికితే చాలు. కానీ రచనలు చెయ్యడానికి తీరిక, మూడ్ రెండూ కావాలి.

కవిత్వం రాయడం ఆషామాషీ కాదని అల్లసాని పెద్దన్న చెప్పనే చెప్పాడు. కథ కేవలం కాలక్షేపం కోసమే కాక ఒక అర్ధాన్ని, పరమార్ధాన్ని కలిగి వుండాలని అతని ఆశ. ఆ రకంగానే రచనలు చేసేవాడు. ఒక కథ తన మీదే రాసుకొని అందులో తనని తాను విమర్శించుకున్నాడు కూడా. మరీ చప్పగా వుండకూడదని ఒక్కొక్కసారి తను చూసిన దానికి కాస్త మసాలా నింపి మంచి మలుపు తిప్పేవాడు.

ఒకసారి అతను చూసిన సంఘటన ఏమిటంటే...?

వర్షం పడుతోంది. హాల్లో కూర్చుని కాఫీ తాగుతూ వీధిలోకి చూశాడు. రోడ్డు మీద ఇద్దరు వ్యక్తులు ఒకే గొడుగులో వెళుతూ, 'తను మాత్రం తడవకూడదు' అనే స్వార్ధంతో గొడుగు తమ తమ వైపు లాక్కుంటున్నారు. అకారణంగా ఇద్దరూ తడిసిపోతున్నారు.

దీన్నే కథ రూపంలో మరో కోణంలో చూపించాడు.

ఒక ఆదర్శ దంపతుల జంట ఇలాగే వర్షం వస్తున్నప్పుడు ఒకే గొడుగు కింద నడుస్తూ వుంటారు. భర్త తడిసిపోకూడదని భార్య గొడుగును అతని వైపుకు వంచుతుంది. భార్య తడిసిపోకూడదని భర్త ఆ గొడుగును ఆమె వైపుకి వంచుతాడు. ఫలితంగా ఇద్దరూ తడిసిపోతారు.

అతని కథలు ప్రచురణకు నోచుకోక తిరిగి వచ్చినప్పుడు, మళ్లీ మళ్లీ ప్రయత్నించమని అతని తండ్రి నరసింహంగారు బాగా ప్రోత్సహించేవారు. అతను రాసిన కథ ప్రతిని చదివి సలహాలు ఇచ్చేవారు. ఒకసారి అతను కథలో 'ఆమె బ్రూ కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసి రెడీగా వుంచింది' అన్న వాక్యం చదివి దాన్ని మార్చమని సలహా ఇచ్చాడు.

'బ్రూ కాఫీ అన్నది తయారు చేయడం ఈజీ. ముందుగా చేసి ఫ్లాస్కులో పొయ్యాల్సిన అవసరం ఏమిటి?' అని ఆయన విమర్శ. నిజమే కదా!

కథ తిరిగి వచ్చిందని మరీ నిరాశపడిపోతే నరసింహంగారు... అబ్రహంలింకన్, ఎడిసన్ మొదలైన వారు ఎన్నిసార్లు ఓటమి ఎదుర్కొని, నిరాశ చెందకుండా ఆ తర్వాత ఎలా విజయం సాధించారో వివరంగా చెప్పారు.

దాంతో రెట్టించిన ఉత్సాహంతో మళ్లీ కదన రంగంలోకి దూకి విజయం సాధించాడు.

ప్రస్తుతం అతను మరో విభాగానికి మారడం జరిగింది.

ఆ విభాగంలో ఆఫీసులో వున్నంత సేపూ పని వున్నా, ఇంటికి వచ్చాక మాత్రం అతనికి ఏ రకమైన చికాకులూ వుండవు. మళ్లీ మర్నాడు తన ఆఫీసుకి వెళ్లేదాకా ఎవ్వరూ అతన్ని తలుచుకోరు. రాత్రి పూట కమ్మగా నిద్రపోవచ్చు.

ఆ కారణంగా అతనికి తీరిక దొరికింది.

అందువల్ల అతనికి బోరుకొట్టసాగింది. పనిలో బిజీబిజీగా వున్నంత సేపూ 'అబ్బా... ఊపిరి ఆడని పనితో విసుగు వస్తోంది. ఎప్పుడు రిటైరు అవుతానురా బాబూ...' అనుకునేవాడు.

కానీ ఇప్పుడు తీరిక దొరికితే ఎలా టైంపాస్ చెయ్యాలా? అని కొత్త సమస్య ఎదురైంది.

ప్రచురించబడిన తన పాత కథల్ని తీసి చదువుకోవడం, ఆ కథ రాయడం వెనుక తనను ప్రేరేపించిన సంఘటనలు గుర్తు చేసుకోవడం... ఇలా కాలక్షేపం చెయ్యసాగాడు.

అంతలో అతని మెదడులో ఒక ఆలోచన మెరుపులా మెరిసింది.

అంతేకాదు...దాన్ని ఆచరణలో పెట్టమని మనసు పోరసాగింది.

అదేమిటంటే...

అదే....అదే....

మళ్లీ కథలు రాయడం ఎందుకు ప్రారంభించకూడదు?

సాహిత్యపరంగా నిద్రపోయిన తన మనసును తట్టిలేపి దానికి ఎందుకు పదును పెట్టకూడదు?

చూసిన సంఘటనలను అలా చూసి వదిలేయకుండా.. విన్న విషయాలను అలా రెండో చెవిలోంచి బయటకు వదిలివెయ్యకుండా, వాటిని మనసుకు పట్టించుకొని మధించి...కొత్త ఆలోచనలకు ప్రాణం పోసి, పుస్తక రూపంలో వాటిని పేర్చి కొత్త కథలు ఎందుకు తయారు చేయకూడదు?

అంత వరకూ మంచి పదునుగా వుండి కూరగాయల్ని చక్కగా తరుగుతున్న కత్తిని కొన్నాళ్లు వాడడం మానేస్తే తుప్పు పట్టి మొండిగా తయారవుతుంది. అందుకని దాన్ని బయటపడేయ్యం. ఒకసారి దాన్ని తోమి పదునుపెడితే మళ్లీ వాడుకోవచ్చు. ఇప్పుడు తను చెయ్యాల్సింది అదే.

కానీ ఒక చిన్న సందేహం!

కాలం గడిచే కొద్దీ ప్రజల అభిరుచిలో తేడా వచ్చింది. తను రాసినవన్నీ పూర్తిగా సాంఘికపర మైన కథలు. ఈ రోజుల్లో కథల్లో కూడా హింస, సెక్సు ఎక్కువైపోయాయి. ఆ రకంగా రాయడానికి తను ప్రయత్నించగలడు కానీ మనసు వద్దం టోంది. అలాంటప్పుడు పాత పంథాలో కథలు రాసి పంపితే అవి ప్రచురణకు యోగ్యం అవుతాయా? ప్రజలు మెచ్చుకుంటారా? తన ఏటికి ఎదురు ఈద గలడా? ఇప్పుడు కూడా కుటుంబ పరమైన కథలు వస్తున్నాయి కానీ వాటి రాసి తక్కువ. సినిమాల సంగతి తీసుకున్నా ఎంత మార్పు?

స్వంత గొంతుతో మాట్లాడే హీరోయిన్లు కరువు. ఒక భక్తి పాటగానీ, ఒక వీణ పాటగానీ కరువు. హీరోయిన్ దుస్తుల కరువు. బొడ్డు కనిపిం చకుండా చీర కట్టుకునే రోజులు పోయి, బొడ్డుమీద క్లోజప్ చూపించే రోజులు వచ్చాయి. ఇదివరకు సెక్సు కథలకి వేరే పుస్తకాలు, వ్యాంపు పాత్రలకి వేరే పాత్రధారులు వుండే వారు. ఇప్పుడు మామూలు పుస్తకాల్లోనే సెక్సు కథలు, హీరోయిన్ ద్వారానే వ్యాంపు భంగిమలు వచ్చేశాయి.

అలాగని కథ రాయాలన్నా తన కుతూహలం చంపుకోలేకపోతున్నాడు. అవి ప్రచురింపబడవేమో అన్న భయం నుంచీ బయట పడలేకపోతున్నాడు.

కృష్ణప్రసాద్ కొడుకు పవన్ కాలేజీలో చదువు తున్నాడు. అవతలివాడు నోరు విప్పి ఏమీ చెప్పక పోయినా ముఖం చూసి ఆ వ్యక్తి ఆలోచనలు పసి గట్టే దిట్ట. ఫోనులో ఒక్కసారి 'హలో' అన్న మాట వినగానే ఆ మాట్లాడిన వ్యక్తి ఆరోగ్యం గురించి అంచనా వెయ్యగల ఘటికుడు. ఒక్కొక్కసారి అతను ఇచ్చే సలహాలు తనకు కూడా తట్టవని, అందుకు తండ్రిగా తను గర్వపడుతున్నాననీ అందరి ముందూ ఒప్పుకుంటూ వుంటాడు కృష్ణప్రసాద్.

''ఏదో ఒక విషయంలో మీరు లోలోపలే ఆలోచిస్తూ మదనపడుతున్నట్లు కనపడుతున్నారు.'' అనాడు పవన్ తండ్రితో.

ఒక్క నిమిషం ఆశ్చర్యంగా చూసి కొడుకు తాలుకూ ప్లస్ పాయింట్లు గుర్తుకువచ్చి చిన్నగా 'అవును' అన్నాడు కృష్ణప్రసాద్.

''వివరాలు చెప్తే నేను కూడా ఆలోచిస్తాను'' అన్నాడు పవన్.

ఒకసారి తలపంకించి ''సరే... విను...'' అంటూ తను మళ్లీ కథలు రాయాలనుకుంటున్న విషయం, తద్వారా తనలోని అంతర్మథనం గురించి వివరంగా చెప్పాడు.

శ్రద్ధగా విన్నాడు పవన్.

ఒకసారి గొంతు సవరించుకుని ఇలా అన్నాడు.

''ఇది చాలా మంచి ఆలోచన. మంచి ఆలోచనల్ని ఆచరణలో పెట్టడానికి ఎంత మాత్రం ఆలస్యం చెయ్యకూడదు. మీరు వెంటనే ప్రారంభించండి. మీకు చెప్పగలిగినంత వయసు లేదు. కానీ భగవ ద్గీతలో శ్రీకృష్ణుడి బోధనలని ఒక్కసారి గుర్తుచేసు కోండి. నీ పని నువ్వు చెయ్యి. ఫలితం నా మీద వదిలి పెట్టు అని కదా అన్నాడు. మీ కథలు ప్రచురింప బడితే మంచిదే. ప్రచురింపబడక తిరిగి వస్తే వాటిని ఫైల్లో పెట్టుకొని చదువుకుంటూ వుండండి. ఆ ఆనందం కూడా ఒకరకంగా అమూల్యమే. ఒక కళాకారుడు ముందుగా తను తృప్తి పడి ఆ తర్వాత మిగతా వాళ్లని తృప్తిపరచడానికి ప్రయత్నిస్తాడు. మీరు రాసిన కథ మీరు చదువుతున్నప్పుడు కలిగే ఆనందం ఇంకొకరు చదివి మెచ్చుకున్నప్పుడు కూడా రాదు. అందంలోనూ కళను ప్రదర్శించేవాళ్లు కూడా తమ స్వీయానందం కోసం ఏదో కళని ఆశ్ర యిస్తారు. బాత్‌రూంలో పాటలు పాడడం అలాంటిదే. అతను పద మందిలో స్టేజి మీద పాడి ప్రేక్షకులను మెప్పించలేకపోవచ్చు. ఒకనా అలా తనలో తాను బాత్‌రూంలో పాడుకుంటున్న ప్పుడు ఎంతో మానసిక ఆనందాన్ని పొందుతాడు. కాగితాల మీద చిన్న చిన్న బొమ్మలు గీయడం, సన్నగా పద్యాలు పాడుకోవడం, ఒక మంచి పాట వింటున్నప్పుడు దానితో గొంతు కలిపి తొడ మీద చిన్నగా అరచేతితో తట్టుకోవడం.... ఇవన్నీ ఆ కోవకే వస్తాయి.''

కొడుకు ముఖంలోకి విస్మయంగా చూశాడు. ఇంత చిన్న వయసులో ఎంత గొప్ప పరిణితి! తన తండ్రి నరసింహంగారు తనకు బోధ చేస్తున్న ట్లుగా అనిపించింది.

''పరుల కోసం కాదు...మీరు మీ కోసం కథలు రాయండి. ఆ కథలు తిరిగి వచ్చినా బాధపడకండి. వాటిని ఫైల్లో దాచుకొని తీరిక దొరికినప్పుడల్లా చదువుకుంటూ మానసిక ఆనందాన్ని పొందండి. ఒకప్పుడు మీరు గుర్తించబడిన రచయిత కనుక నా ఉద్దేశ్యంలో ముందుగా కొన్ని కథలు తిరిగి వచ్చినా కొన్ని ప్రచురింపబడకపోవు. దాంతో రెట్టించిన ఉత్సాహంతో మీరు మరింత ముందుకు దూసుకు పోతారు. సచిన్ టెండూల్కర్ ఒక మ్యాచ్‌లో జీరోలో అవుట్ అయినా తర్వాతి ఆటలో సెంచరీలు చెయ్యడం మనం ఎన్నోసార్లు చూశాం. విశ్వనాథ్ గారి సినిమాలు కొన్ని ఫ్లాప్ అయినా ఆ తర్వాత మరో మంచి చిత్రం తీసి హిట్ చేసారు. మీకో చిన్న సెంటిమెంట్ క్లూ ఇస్తాను..''

ఏదో సస్పెన్సు పెంచడానికి అన్నట్లు ఒక్క నిమిషం చెప్పడం ఆపాడు పవన్.

కృష్ణప్రసాద్ పెదవుల మీద ఒక చిరుదర హాసం.

''భలేగా చెప్తున్నావురా...'' అంటూ చూపుల తోనే ఒక అభినందన.

అతనికి ఆ సమయంలో రామాయణంలోని ఒక ఘట్టం గుర్తొచ్చింది. అదే...హనుమంతుడు తను సముద్రం దాటగలనా అని సందేహంతో వుంటే మిగతా వానర వీరులంతా కలసి అతని బలాన్ని గుర్తుచేసి ఈ బృహత్కార్యం కేవలం నీ వల్లనే సాధ్య మవుతుందయ్యా స్వామీ అని ప్రోత్సహించడం.

''ఏమిటో చెప్పు....'' అన్నారు కృష్ణప్రసాద్ ఆలస్యం భరించలేనన్నట్లుగా.

''మీ కథ మొదటిసారిగా ఏ వార పత్రికలో ప్రచురించబడిందో అదే వార పత్రికకు ఒక కథ రాసి పంపండి.. అది తప్పకుండా ప్రచురింపబడుతుంది.''

ఇక ఆలస్యం చెయ్యకూడదని, అప్పటికే తను బుర్రలో సృష్టించి పెట్టుకున్న కథాంశాన్ని కూడా ఒకసారి గుర్తుచేసుకొని ఆ రోజు రాత్రే కథ రాయడం మొదలుపెట్టాడు కృష్ణప్రసాద్. 'జైగణేష్' అని మన సులో అనుకొని, ఎదురుగా వున్న షిర్డి సాయిబాబా ఫొటోకి ఒక్కసారి నమస్కారం చేసుకొని.

★

